క్లుప్తంగా

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్చాలి



సిరిపురంలో బడిఈడు పిల్లలను గుర్తిస్తున్న హెచ్‌ఎం సుందరరావు, ఉపాధ్యాయులు

ఏలేశ్వరం: బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్చాలని ప్రధానోపాధ్యాయుడు జి.సుందరరావు అన్నారు. మండలంలోని సిరిపురం గ్రామంలో మంగళవారం ఆయన ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి బడిఈడు పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ బడిఈడు పిల్లలను విధిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళి, అప్పారావు, జ్యోతి, సుల్తానా పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



సూర్యచక్ర (ఫైల్)

కిర్లంపూడి: యువతి అదృశ్యంపై మంగళవారం స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైనట్లు కిర్లంపూడి ఏఎస్సై కె.రామకృష్ణ మూర్తి తెలిపారు. మండల పరిధి శృంగరాయునిపాలెం పుట్టింటికి వచ్చిన 21 ఏళ్ల రామిశెట్టి సూర్యచక్ర గాజులు వేయించుకుంటానని మంగళవారం ఉదయం 10గంటలకు బయటకు వెళ్లింది. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో బంధువులను అడగగా తమ ఇళ్లకు రాలేదని తెలపడంతో సూర్యచక్ర తల్లి నల్లా సుబ్బలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రామకృష్ణమూర్తి తెలిపారు. సూర్యచక్రకు ఇద్దరు పిల్లలు, భర్త ఉన్నారు. ఆచూకీ తెలిసినవారు 9440904834 నంబర్‌కు ఫోన్ చేసి కిర్లంపూడి ఎస్సై టి.రఘునాథరావుకు సమాచారం తెలపాలన్నారు.

పర్యావరణ హిత జీవనశైలిపై అవగాహన



శివరామపట్నంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు

గోకవరం: మండలంలోని కామరాజుపేట పంచాయతీ పరిధిలోని శివరామపట్నం గ్రామంలో మంగళవారం అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణ జీవనశైలిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు కట్టుబడతామని రైతులు, వ్యవసాయ కూలీలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని, సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. మల్లవరం అటవీ శాఖాధికారి వెంకట్రావు, సూదికొండ బీటు అధికారి డి.కామేశ్వరరావు, రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

గోకవరం పంచాయతీకి రూ.50 వేల నజరానా

గోకవరం: 2021–22 సంవత్సరానికి గోకవరంను ఉత్తమ పంచాయతీగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రూ.50 వేలు నజరానా ప్రకటించిందని ఎంపీడీఓ కేఎస్ఎస్ఎన్ మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నగదు గ్రామ పంచాయతీ ఖాతాలో జమ అయ్యిందన్నారు. గోకవరం పంచాయతీ మండలంలో ఉత్తమ పంచాయతీగా నిలవడానికి కృషి చేసిన సర్పంచ్ కొమరం శ్రావణి, పాలకవర్గం సభ్యులు, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావులను ఈ సందర్భంగా అభినందించారు. అలాగే పంచాయతీ అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేసిన స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుకి కృతజ్ఞతలు తెలిపారు.

పేకాట శిబిరాలపై పోలీసుల దాడులు

జగ్గంపేట: మండలంలోని పలుచోట్ల పేకాట ఆడుతున్న శిబిరాలపై జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3,500 స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. జగ్గంపేట శెట్టిబలిజీపేటలో పేకాట శిబిరం వద్ద నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,600, గుర్రంపాలెం గ్రామ శివారులో శిబిరం వద్ద ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రూ.1,900 స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. వీరిని బుధవారం కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

నిప్పుల కొలిమి

ప్రత్తిపాడు: వేసవి తారెత్తిస్తోంది. ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోతున్నాయి. వడ గాలులు ఉధృతమయ్యాయి. వెచ్చటి గాలులతో వాతావరణం నిప్పుల కొలిమిలా మారింది. ఉదయం 7 గంటల నుంచే సూర్య భగవానుడు భగభగ మంటూ కన్నెర్ర చేశాడు. రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మంగళవారం మధ్యాహ్నం అత్యధికంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం 6 గంటలకు 37 డిగ్రీల ఉష్ణోగ్రత ఉందంటే ఉష్ణతాపం ఎలా ఉందో అవగతమవుతోంది. 11 గంటల నుంచే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు.

తాణా సెంటర్ వంతెనకు మోక్షం

- నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు
- ఏళ్ల తరబడి తిష్టవేసిన సమస్యకు పరిష్కారం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



గోకవరం తాణా సెంటర్‌లో ఊర కాలువపై బ్రిటిషు కాలం నాటి వంతెన

గోకవరం: మండల కేంద్రమైన గోకవరం తాణా సెంటర్‌లో కొంతకాలంగా నెలకొన్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించనుంది. తాణా సెంటర్‌లో ఊరకాలువపై ఉన్న బ్రిటిషు కాలం నాటి ఇరుకు వంతెన స్థానంలో నూతనంగా వంతెన నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. దీంతో దశాబ్దాల కాలంగా నెలకొన్న సమస్య పరిష్కారం కానుంది. తాణా సెంటర్లో ఉన్న వంతెనను సుమారు వంద సంవత్సరాల క్రితం నిర్మించారు. చాలా ఏళ్ల క్రితమే ఈ వంతెన శిథిలావస్థకు చేరింది. నిత్యం ఈ వంతెనపై రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వందల సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెన ఇరుకుగా ఉండటంతో ఒక్కోసారి వాహనాలు రక్షణ గోడలను ఢీకొంటున్నాయి. రక్షణ గోడలు బీటలు వారడంతో వంతెన కూలుతుందేమోనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతెన ఇరుకుగా ఉండటం వంతెనకు ఇరువైపులా భారీ మలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు సైతం సంభవిస్తున్నాయి. ఇప్పటి వరకు ఈ వంతెనపై జరిగిన ప్రమాదాల్లో అనేకమంది మృత్యువాత పడగా గాయాలపాలైన వారు చాలామంది ఉన్నారు. వంతెన వద్ద నిత్యం ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఒక్కోసారి వంతెనపై భారీ వాహనాలు నిలిచిపోయి గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఈ వంతెన స్థానంలో నూతనంగా వంతెన నిర్మించాలని అనేక పర్యాయాలు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఆందోళనలు సైతం చేపట్టారు. ఇక్కడ వంతెన నిర్మించడానికి ఎనిమిదేళ్ల క్రితం ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు రూ.కోటి వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్లు ఆహ్వానించారు. కానీ ఆ నిధులతో వంతెన నిర్మాణం పూర్తికాదంటూ కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు జరగలేదు.

త్వరలో శంకుస్థాపన

ఏళ్ల తరబడి సమస్యగా ఉన్న ఈ వంతెన స్థానంలో నూతనంగా వంతెన నిర్మించడానికి రూ.10 కోట్లు నిధులు మంజూరయ్యాయి. రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకు 516–ఇ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తాణా సెంటర్‌లో ఉన్న వంతెనను నిర్మించేందుకు నిధులు మంజూరు చేసినట్టు ఇటీవల కాకినాడ ఎంపీ వంగా గీత తెలిపారు. త్వరలోనే టెండరు ప్రక్రియ పూర్తి చేసి వంతెనకు శంకుస్థాపన చేయనున్నామన్నారు. వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో గోకవరం ప్రజలతో పాటు ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యకు పరిష్కారం లభించడంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

త్వరలో టెండరు ప్రక్రియ

వంతెన నిర్మించేందుకు రూ.10 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో టెండరు ప్రక్రియ చేపడతాం. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే వంతెన నిర్మాణ పనులు చేపడతాం.

– శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ శాఖ జేఈ

ట్రాఫిక్ కష్టాలు తీరతాయి

తాణా సెంటర్‌లో వంతెన ఇరుకుగా ఉండటంతో ప్రతీ రోజు ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఆదివారం ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. వంతెన నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ కష్టాలు తీరతాయి.

– జి.మనీష్ కుమార్, గోకవరం

రోగాల నివారణకు జాగ్రత్తలు



ఏలేశ్వరంలో డెంగీ దినోత్సవంలో మాట్లాడుతున్న కమిషనర్ కొండలరావు

ఏలేశ్వరం: రోగాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కొండలరావు అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఆయన ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రోగాల పట్ల అప్రమత్తంగా ఉండి నివారణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల ద్వారా అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా రోగాలు నివారించవచ్చన్నారు. మున్సిపల్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు, తొండారపు రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

129 మందికి వైద్య పరీక్షలు



హంసవరం ఫ్యామిలి మెడికల్ క్యాంపులో పరీక్షలు చేస్తున్న డాక్టర్ అన్వేషి

తుని రూరల్: మండలంలోని హంసవరంలో గ్రామ సర్పంచ్ రాయి మేరీఅవినాష్ ఆధ్వర్యంలో జరిగిన ఫ్యామిలి ఫిజీషియన్, 104 మెడికల్ క్యాంపులో 129 మందికి వైద్య పరీక్షలు చేశారు. మంగళవారం తేటగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అన్వేషి పర్యవేక్షణలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి రోగులను పరీక్షించి, ఉచితంగా మందులను అందజేశారు. బీపీ, సుగర్ పరీక్షించారు. జనరల్ ఓపీ నిర్వహించి, 72 మంది హెల్త్‌కార్డులను ఆన్‌లైన్ చేశారు. ఏఎన్‌ఎం సునీత, ఎంపీహెచ్‌డబ్ల్యూ సుబ్రహ్మణ్యం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు చర్యలు

శంఖవరం: గ్రామాల్లో రోజు రోజుకు పెరుగుపోతున్న డెంగీ జ్వరాల నివారణకు చర్యలు చేపట్టాలని వైద్యాధికారి ఆర్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ఏఎన్‌ఎంలకు, ఆశాకార్యకర్తలకు, సిబ్బందికి అవగాహన కల్పించి ర్యాలీ చేశారు. ఆయన మాట్లాడుతూ చెత్త చెదారం పేరుకుపోయి దోమల సంతతి పెరగడం ద్వారా డెంగీ జ్వరాలు వస్తున్నాయన్నారు. లార్వా దశలోనే దోమలను అరికట్టాలన్నారు. వైద్యులు ఎస్ఎస్ రవికుమార్, ఎస్.రాజీవ్ కుమార్, కె.సరోజ, ఎంపీహెచ్ఓ నానాజీ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు

రౌతులపూడి: స్థానిక మార్కెట్ సమీపంలో ఉన్న పంచాయతీ కార్యాలయంలో నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ఎట్టకేలకు మార్గం సుగమం అయింది. ఈ మేరకు మంగళవారం పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి పంచాయతీ కార్యాలయం భవన సముదాయాన్ని చుట్టువున్న పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానిక ప్రజా ప్రతినిధుల సూచనల మేరకు స్టేషన్ ఏర్పాటుకు పంచాయతీ కార్యాలయాన్ని గుర్తించామని డీఎస్పీ తెలిపారు. భవన సముదాయం కోసం జిల్లా పంచాయతీ అధికారుల అనుమతులు కోరతామన్నారు. వీలైనంత త్వరగా స్టేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రత్తిపాడు, తుని సీఐలు కె.కిశోర్ బాబు, ఎ.ఎస్.రావు, అన్నవరం, కోటనందూరు ఎస్ఐలు శోభన్‌కుమార్, స్వామినాయుడు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం

ఎమ్మెల్యే చంటిబాబు



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటిబాబు

కిర్లంపూడి: అర్హులైనవారికి సంక్షేమ పథకాలు అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోట రవి అధ్యక్షతన జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చంటిబాబు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే మండల అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. భూ రీసర్వేలో తలెత్తుతున్న సమస్యలపై స్థానిక నాయకులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరించాలని తహసీల్దార్ కేవీ మాధవరావు ఆదేశించారు. అనంతరం ఎంపీపీ రవి శాఖల వారీగా ప్రగతిని సమీక్షించి ప్రజాప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రజాప్రతినిధులు విద్యుత్, భూ రీసర్వే, ఉపాధి కూలీ పేర్ల తొలగింపు, అంగన్‌వాడీ సెంటర్ల నిర్మాణాలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే చంటిబాబు ఆదేశించారు. తోట గాంధీ, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దొమాల గంగాధర్, సొసైటీ చైర్మన్ చదలవాడ బాబి, పెంటకోట నాగబాబు, సచివాలయం కన్వీనర్ తోట విష్ణు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు బిళ్ళకుర్తి నాగమణి, మొల్లేటి సరస్వతి, మండల సచివాలయాల కన్వీనర్ పెనగంటి రాజేష్, ఎంపీడీఓ బి.సతీష్‌బాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ది ప్రజలు మెచ్చిన పాలన



నెల్లిపూడిలో మహిళకు సంక్షేమ పథకాల పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే పర్వత

- ఎమ్మెల్యే పర్వత
- శంఖవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం

శంఖవరం: ప్రజలు మెచ్చిన పాలన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలో నెల్లిపూడి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని, మూడేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. కరోనా కష్టకాలంలోనూ రైతు భరోసా, అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ జలకళ వంటి సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రానున్న కాలంలో ఈ పథకాలన్నీ అమలవ్వాలంటే మరోసారి జగన్‌ను సీఎంగా గెలిపించాలని కోరారు. ఎంపీపీ పర్వత రాజుబాబు, ఎంపీడీఓ జె.రాంబాబు, సర్పంచ్ నరాల శ్రీలత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా విధులు నిర్వర్తించాలి



ప్రత్తిపాడులో మహిళా పోలీసుల వర్క్‌షాపులో ప్రసంగిస్తున్న పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి



హాజరైన మహిళా పోలీసులు

డీఎస్పీ లతాకుమారి

ప్రత్తిపాడు: గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులు పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి అన్నారు. ప్రత్తిపాడులో మంగళవారం పెద్దాపురం సబ్ డివిజన్ స్థాయి మహిళా పోలీసులకు 'వన్ డే వర్క్ షాపు' నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఎస్పీ లతా కుమారి మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణలో మహిళా పోలీసులదే కీలక పాత్ర అని చెప్పారు. సచివాలయ పరిధిలో మహిళా పోలీసులు నిర్వహించాల్సిన విధులు, మహిళా భద్రత, గుడ్ టచ్ అండ్ బాడ్ టచ్, సైబర్ క్రైం, రోడ్ సేఫ్టీ, చైల్డ్ మ్యారేజ్, డ్రగ్ అబ్యూస్, ప్రాపర్టీ అఫెన్సెస్, లా అండ్ ఆర్డర్ సమస్యలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. పెద్దాపురం సబ్ డివిజన్‌లోని ప్రత్తిపాడు, తుని టౌన్, తుని రూరల్, సామర్లకోట, పెద్దాపురం, జగ్గంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు కె.కిషోర్‌బాబు, ఎం.నాగదుర్గారావు, ఎ. సన్యాసిరావు, కె.దుర్గాప్రసాద్, ఎస్‌కే అబ్దుల్ నబీ, బి.సూర్యఅప్పారావు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం తనిఖీ



బొద్దవరం సచివాలయంలో సర్వీసు రిక్వెస్టుల రిపోర్టును పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్

కోటనందూరు: మండలంలోని బొద్దవరం గ్రామ సచివాలయాన్ని పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయ పరిసరాలు, సిబ్బంది బయోమెట్రిక్ హాజరు పరిశీలించిన ఆయన సర్వీసు రిక్వెస్టుల రిపోర్టును పరిశీలించారు. అర్జీల పరిష్కారంలో జాప్యం జరగకూడదని సిబ్బందిని ఆదేశించారు. సచివాలయానికి వచ్చిన గ్రామస్తులకు మెరుగైన సేవలందించాలని సూచించారు.

జోరుగా పారిశుధ్య పనులు

జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల వ్యాప్తంగా పారిశుధ్య పనులు జోరుగా సాగాయి. పంచాయతీ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు గ్రామాల్లో పర్యటించి గుంతలు, టైర్లు, రుబ్బురోళ్లు, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న నిల్వ నీటిని తొలగించి దోమల నివారణ మందును పిచికారీ చేశారు. టీజే నగరం, బొద్దవరం, కొత్తకోట్టాం, ఎల్లీపేట గ్రామాల్లో జరిగిన పారిశుధ్య పనులను పంచాయతీ విస్తరణాధికారి అరుణ్‌కుమార్ పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి సీహెచ్ భవానీ, కుశిరెడ్డి అప్పలరాజు, రామచంద్రకుమార్ పాల్గొన్నారు.

స్థాయీ సంఘం దృష్టికి జగ్గంపేట సమస్యలు



సమావేశంలో సమస్యలను వివరిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు బిందుమాధవి

జగ్గంపేట: మండలంలో పలు సమస్యల పరిష్కారానికి సహకరించాలని జిల్లా పరిషత్ సమావేశం దృష్టికి తీసుకువెళ్లినట్లు జగ్గంపేట జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బిందుమాధవి తెలిపారు. మంగళవారం కాకినాడలో జరిగిన జిల్లా పరిషత్ రెండో స్థాయీ సంఘ సమావేశంలో జగ్గంపేట మండల సమస్యలపై వివిధ శాఖల అధికారులకు, జిల్లా పరిషత్ చైర్మన్‌కు వివరించానని ఆమె జగ్గంపేటలో తెలిపారు. ప్రధానంగా జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు ప్రభుత్వం జనరేటర్, స్కానింగ్ మెషీన్ మంజూరు చేసిందని వాటిని ఇప్పటివరకూ వినియోగంలోకి తేలేదని, అధికారులకు వివరించినట్లు తెలిపారు. జగ్గంపేటలో పలు ప్రాంతాలు భారీ వర్షాలు వచ్చినపుడు ముంపునకు గురి అవుతున్నాయని, నివారణ చర్యలు తీసుకోవాలని వివరించామని చెప్పారు. ఈ క్రాప్ బుకింగ్‌లో రైతులు పొరపాటున వేరే పంటను నమోదు చేసుకున్నారని, వాటిని మార్చుకునే అవకాశం రైతులకు కల్పించి వారికి మేలు జరిగేలా చూడాలని కోరినట్లు చెప్పారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం పాల్గొన్నారు.

జూన్ 12 నాటికి నాడు–నేడు పనులు



సమావేశంలో మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ డీఈ వేణుగోపాలరావు

ప్రత్తిపాడు: వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం (జూన్ 12) నాటికి రెండో విడత నాడు – నేడు పనులు పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎస్ వెంకటాచలం ఆదేశించారు. స్థానిక విద్యాశాఖ మానవ వనరుల కేంద్రంలో మంగళవారం నాడు–నేడు పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో పాల్గొన్న ఎంపీడీఓ ఎస్.వెంకటాచలం మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపించకుండా పారదర్శకంగా ఉండాలన్నా రు. మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు మాట్లాడుతూ మండలంలోని ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 13 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లు, మూడు ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల ఆధునికీకరణకు రూ.11.33 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. సమావేశంలో మండల ఇంజినీరింగ్ అధికారి ఎన్.నాగేశ్వరరావు, సీఆర్పీలు ఇ.రాంజీప్రసాద్, అప్పన మల్లేషు, గంగారావు, బాషా, ఎంఐఎస్ పట్టాభి పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా....

గ్రామాల్లో మంజూరైన జగనన్న ఇళ్ల కాలనీల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణశాఖ డీఈ వేణుగోపాలరావు ఆదేశించారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జగనన్న ఇళ్ళ కాలనీలపై సమీక్షా సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామాల్లో స్వంత స్థలాలున్న లేఅవుట్లలో 343 ఇళ్లు, మరో 18 గ్రామాల్లో ప్రధానమంత్రి అవాస్ యోజనలో 180 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. వీటికి జియోట్యాగింగ్, మ్యాపింగ్ తదితర వాటిని పూర్తి చేసి, ఇళ్ల నిర్మాణం వేగవంతమయ్యేలా క్షేత్రస్థాయి సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ ఎస్.వెంకటాచలం, గృహ నిర్మాణశాఖ ఏఈ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రత్నగిరిపై వేగంగా డార్మెట్రీ నిర్మాణం

- రూ.రెండు కోట్లతో నిర్మిస్తున్న దాత రాజామణి
- ఇప్పటికే మూడొంతుల పని పూర్తి
- ఏక కాలంలో వేయి మంది భక్తుల విశ్రాంతికి ఏర్పాట్లు



శ్లాబ్‌ల వరకు పూర్తయిన డార్మెట్రీ నిర్మాణం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ ఆలయం ఎదురుగా రూ. రెండు కోట్లు వ్యయంతో దాత పెన్నాడ రాజామణి నిర్మిస్తున్న డార్మెట్రీ (భక్తుల విశ్రాంతి భవనం) పనులు వేగంగా జరుగుతున్నాయి. గత ఏడాది ఆగస్టులో ఈ డార్మెట్రీ నిర్మాణం పనులు ప్రారంభం కాగా, ఇప్పటికే మూడొంతుల పనులు పూర్తయ్యాయి.

నడక దారి భక్తులు సేద తీరేందుకు...

రత్నగిరి సత్యదేవుని దర్శనానికి మెట్లదారి వెంట వచ్చే భక్తులు సేద తీరేందుకు శ్రీవనదుర్గ అమ్మవారి ఆలయం వద్ద డార్మెట్రీ నిర్మించాలని దేవస్థానం అధికారులు నిర్ణయించారు. అదే సమయంలో రాజమహేంద్రవరానికి చెందిన దాత పెన్నాడ వేంకట రాజామణి సత్యదేవుని భక్తుల కోసం డార్మెట్రీ నిర్మించ నున్నట్లు తెలిపారు. దాంతో అప్పటి ఈఓ వి.త్రినాథరావు శ్రీవనదుర్గ ఆలయం వద్ద గల పాత భవనాన్ని కూల్చివేసి ఆ స్థలాన్ని దాతకు అప్పగించారు. గత ఏడాది ఆగస్టు 13వ తేదీన ఉపముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్ ఈ డార్మెట్రీ నిర్మాణానికి భూమి పూజ చేశారు.

మూడు అంతస్తుల్లో..

మొత్తం 3,900 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడంతస్తులలో నిర్మాణమవుతున్న ఈ భవనంలో ఏక కాలంలో వేయిమంది సేద తీరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ భవనంలో స్నానపు గదులు కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల భక్తులు వసతి గదుల కోసం ప్రయత్నించకుండా ఇక్కడే స్నానం చేసి స్వామివారిని దర్శనం చేసుకోవచ్చు.

శరవేగంగా..

సాధారణంగా దేవస్థానం ఏదైనా నిర్మాణం ప్రారంభమవ్వాలంటే నిర్మాణ అంచనా, దానిని కమిషనర్ ఆమోదం, ఆ పై టెండర్లు, లోయెస్ట్ టెండర్ ఆమోదం , ఆ పై కాంట్రాక్టర్‌తో నిర్మాణ ఒప్పందం, ఆ తరువాత పనులు ప్రారంభమవుతాయి. ఇదంతా జరగడానికి కనీసం నాలుగు నెలలు పడుతుంది. అటువంటిది భూమి పూజ జరిగిన వెంటనే దాత పనులు ప్రారంభించారు. మూడు నెలలకే పునాదుల వరకు పనులు పూర్తి కాగా, తొమ్మిది నెలలకే మూడు శ్లాబ్‌ల నిర్మాణం పూర్తి చేశారు. ప్రస్తుతం బ్రిక్ వర్క్ జరుగుతోంది. దీని తరువాత టైల్స్ అతికించడం, టాయిలెట్స్ నిర్మాణం, విద్యుత్ పనులు చేస్తామని ఆ పనులు పర్యవేక్షిస్తున్న కాంట్రాక్టర్ అబ్బులు తెలిపారు.

ఆగస్టు కల్లా అప్పగిస్తాం: దాత రాజామణి

అనుకున్న దాని కన్నా పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.రెండు కోట్ల కన్నా ఎక్కువ ఖర్చు అయినా భరించి ఆగస్టు నాటికి దీనిని పూర్తిచేసి దేవస్థానానికి అప్పగిస్తామని దాత రాజామణి తెలిపారు.

ఎండ ప్రతాపం



ఏలేరు నదిలో స్నానాలు చేస్తున్న యువకులు

వేసవి ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రజలు వేడిమితోపాటు ఉక్కపోతతో తిప్పలు పడుతున్నారు. ఉదయం నుంచి ఎండలు తమ ప్రతాపం చూపుతున్నాయి. సాయంత్రమైనా ఎండలు తగ్గకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 11 గంటల నుంచి ప్రధాన రహదారులపై జన సంచారం తగ్గుతోంది. ఎండలను తట్టుకొనేందుకు యువకులు ఏలేశ్వరం, తిరుమాలి, యర్రవరం గ్రామాల మీదుగా ఉన్న ఏలేరునదిలో స్నానాలు చేస్తున్నారు. స్నానాలతో యువకులు ఉపశమనం పొందుతున్నారు. మూగజీవాలు సైతం కాలువలో దిగి మురుగునీరులోనే సేద తీరుతున్నాయి. **ఏలేశ్వరం**